
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి. మార్కెట్‌కు 592 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.


స్పందన

17న స్పందన రద్దు

సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఈనెల 17వ తేదీ సోమవారం కలెక్టరేట్ నిర్వహించాల్సిన 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
41.1°/22.3°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.



సహజ ఫలం.. మధురం

ప్రారంభమైన 'మామిడి' సీజన్

- కాల్షియం కార్బైడ్‌కు స్వస్తి చెబుతున్న వ్యాపారులు
- ఇథిలిన్ ద్వారా పండ్లను మాగబెడుతున్న వైనం
- మండీలకే వచ్చి కొనుగోలు చేస్తున్న జనం
- ధర్మవరం నుంచి ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు



ఇథిలిన్ యూనిట్‌లో మాగబెట్టిన మామిడి పండ్లు



మామిడి... పేరు చెబితేనే ఎవరికైనా నోరూరుతుంది. వేసవి వచ్చిందంటే ఫలరాజు మార్కెట్‌లో కనువిందు చేస్తుంది. గతంలో కొందరు వ్యాపారులు లాభాపేక్షతో రసాయనాలతో మామిడిని మాగబెట్టేవారు. వీటిని తినాలంటే జనం జంకేవారు. నేడు పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం ఎలాంటి హాని కలిగించని పద్ధతుల్లో ఇథిలిన్ ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. ఫలితంగా కొనుగోళ్లకు జనం క్యూ కడుతున్నారు.

ధర్మవరం: ఫలరాజు మామిడి తినేందుకు చిన్నాపెద్దా అందరూ ఇష్టపడతారు. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి అమ్మకాలు ఊపందుకోగా, అందరూ సహజసిద్ధ పద్ధతుల్లో మాగించిన మామిడికే ఓటేస్తున్నారు. వ్యాపారులు కూడా ఇథిలిన్ గ్యాస్ ఉపయోగించి ప్రజారోగ్యానికి ఎలాంటి హాని కలిగించని విధంగా పండ్లను మాగబెడుతున్నారు.

గతంలో 'కార్బైడ్' మామిడికే వ్యాపారుల మొగ్గు..

మామిడి పండ్లు తొందరగా పక్వానికి తెచ్చేందుకు గతంలో వ్యాపారులు కార్బైడ్‌కు మొగ్గుచూపేవారు. కార్బైడ్ ఉపయోగించడం వల్ల మామిడిపండుకు మంచి రంగుతోపాటు తొందరగా పండుతుంది. పచ్చి సరుకును వ్యాపారులు త్వరితగతిన చేతులు మార్చి వీలైనంత లాభాలు ఆర్జించేవారు. కానీ కార్బైడ్ ద్వారా మాగబెట్టిన పండ్లు తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అందువల్లే ధర కాస్త ఎక్కువైనా సహజసిద్ధ పద్ధతుల్లో మాగబెట్టిన మామిడి తినడం అలవాటు చేసుకున్నారు. దీంతో వ్యాపారుల తీరులోనూ మార్పు వచ్చింది.

పెరిగిన 'ఇథిలిన్' యూనిట్లు..

రసాయనిక పద్ధతుల్లో మాగబెట్టిన మామిడి పండ్లు కొనేందుకు జనం ఆసక్తి చూపకపోవడంతో వ్యాపారులూ తమ రూటు మార్చుకున్నారు. ఈ క్రమంలోనే రసాయనిక పద్ధతులకు స్వస్తి చెప్పిన ధర్మవరం వ్యాపారులు ఇథిలిన్ గ్యాస్ ద్వారా మామిడి పండ్లను మాగబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో తొలిసారిగా 2000 సంవత్సరంలో పట్టణానికి చెందిన అబ్దుల్ గఫార్ అనే వ్యాపారి ధర్మవరంలో ఇథిలిన్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో జిల్లా వ్యాప్తంగా ఇథిలిన్ యూనిట్ల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఒక్క ధర్మవరంలోనే 8 యూనిట్ల పని చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, కదిరి తదితర పట్టణాల్లోనూ 'ఇథిలిన్' యూనిట్లను విరివిగా ఏర్పాటు చేశారు.

యూనిట్ పనిచేసే విధానం..

ఇథిలిన్ యూనిట్‌లో విశాలమైన గదులుంటాయి. ప్రతి గదిలోనూ రెండు ఏసీ మిషన్‌లు ఉంటాయి. యూనిట్ బయట ఇథిలిన్ సిలిండర్లను అమర్చి ఒకపైపును గదికి అనుసంధానిస్తారు. గదుల్లో మామిడి పండ్లను నిల్వ ఉంచి పైపు ద్వారా ఇథిలిన్ వాయువును పంపుతారు. దీని ప్రభావంతో పండ్లు పక్వానికి వస్తాయి. ఇందుకోసం రెండు రోజుల పాటు గ్యాస్, ఏసీ మిషన్‌లు పని చేయాల్సి ఉంటుంది. కార్బైడ్‌తో మాగబెట్టడంతో పోలిస్తే ఇథిలిన్ ద్వారా పండ్లు మాగబెట్టేందుకు ఖర్చు ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ వ్యాపారులు ప్రజల కోరిక మేరకు 'ఇథిలిన్' పద్ధతికే మొగ్గుచూపుతున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు..

ధర్మవరంలో 'ఇథిలిన్' ద్వారా మాగబెట్టిన మామిడి పండ్లకు మంచి గిరాకీ ఉంది. కేవలం పట్టణవాసులు మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మరీ వ్యాపారులు, ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి బేనిషా, చెరకు, రసాల్, దసేరి, మల్లుబా, బాదామి తదితర రకాల మామిడి పండ్లు పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

రాయితీలు అందించాలి



కార్బైడ్‌తో పోలిస్తే 'ఇథిలిన్ గ్యాస్' ద్వారా మామిడి మాగబెట్టేందుకు ఖర్చు ఎక్కువగా ఉంటుంది. టన్ను మామిడి మాగబెట్టేందుకు కార్బైడ్‌తో అయితే రూ.200 ఖర్చు ఉంటుంది. అదే ఇథిలిన్ ద్వారా రూ.600 అవుతుంది. ఒక ఇథిలిన్ యూనిట్ స్థాపించాలంటే రూ.20 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. ప్రభుత్వం రాయితీలిస్తే మరిన్ని యూనిట్లు నెలకొల్పే వీలుంటుంది. తద్వారా ప్రజలకు మేలైన సహజసిద్ధ పద్ధతుల్లో మాగబెట్టిన పండ్లు అందుబాటులోకి వస్తాయి.
– అబ్దుల్ గఫార్, ఇథిలిన్ గ్యాస్ యూనిట్ నిర్వాహకుడు

కార్బైడ్ చాలా ప్రమాదకరం



కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. వాంతులు, విరేచనాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లివర్, ఉదర సంబంధిత జబ్బులూ వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రజలు సహజ సిద్ధంగా మాగబెట్టిన మామిడి పండ్లను మాత్రమే తినాలి.
– డాక్టర్ ఇందురేఖ, ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు, ధర్మవరం

మధురంగా ఉన్నాయి



ఇథిలిన్ గ్యాస్ ద్వారా మాగబెట్టిన మామిడి పండ్లు మధురంగా ఉన్నాయి. పిల్లలు ఎంతో ఇష్టంగా తింటున్నారు. అందువల్లే నేరుగా మండీ వద్దకే వచ్చి పండ్లు కొంటున్నాం. వ్యాపారులు కూడా కార్బైడ్‌కు స్వస్తి చెప్పి ఇథిలిన్ గ్యాస్ ద్వారా పండ్లను మాగబెడితే అందరికీ మేలు.
– తొండమాల ఉమాదేవి, కౌన్సిలర్, ధర్మవరం

న్యూస్‌రీల్

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడు రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్, గుత్తి పాఠశాల ప్రిన్సిపాల్ బీఈ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం, నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు httpr://aprs.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

ఎస్కేయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్ విడుదల



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవ నోటిఫికేషన్ విడుదలైంది. వీసీ రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు 2022లో పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అంతకుముందు పూర్తి చేసిన వారు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో మే 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. అయితే దరఖాస్తులు ఆన్‌లైన్ విధానంలో గురువారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్ తెలిపారు. గురువారం నుంచి (ఏప్రిల్ 20) www.skuniversity.ac.in ఈ htt ps;//skuonline.in లో తెలుసుకోవచ్చు.

సోషల్ పరీక్షకు 227 మంది గైర్హాజర్



బుక్కపట్నం కేంద్రంలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రశాంతి నిలయం: పదో తరగతి జనరల్ పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజు జిల్లాలోని 125 కేంద్రాల్లో నిర్వహించిన సోషల్ పరీక్షకు 22,487 మందికి గాను 22,260 మంది విద్యార్థులు హాజరయ్యారు. 227 మంది గైర్హాజరయ్యారు. ఈనెల 17న సంస్కృతం, 18న ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని జిల్లా విద్యాశాఖాధికారిణి మీనాక్షి తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు బుక్కపట్నం బాల, బాలికల ఉన్నత పాఠశాల్లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కాగా, కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'పది' పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూంను 'పది' పరీక్షల పరిశీలకుడు, ఆర్జేడీ ప్రతాప్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు.

సమాచారం ఇవ్వకపోతే సాగనంపుతా


- స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎస్పీ మాధవ రెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి

కొత్తచెరువు: '' స్పెషల్ బ్రాంచ్ పోలీసు శాఖలో కీలకం. లాండ్ ఆర్డర్ సంబంధించిన సమాచారం వివిధ ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి రావాలి. అప్పుడే తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఎవరైనా సిబ్బంది స్థానికంగా లోపాయికారీ ఒప్పందాలతో సమాచారం చేరవేయకుంటే చర్యలు తప్పవు. అలాంటి వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటా. అవసరమైతే సాగనంపుతాం'' అని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తుండాలన్నారు. రానున్నకాలంలో పోలీస్ శాఖ ఎంతో కీలకమైందని, ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకముందే వాటిని నిలువరించే విధంగా చూడాలన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష



లేపాక్షి: మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి 3,631 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికోసం 11 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం



విమానాశ్రయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు

పుట్టపర్తి టౌన్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 17న నార్పలకు విచ్చేయనున్న సీఎం జగన్... గన్నవరం విమానాశ్రయం నుంచి పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నార్పలకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గన్నవరం నుంచి బయలుదేరి ఉదయం 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకోనున్న సీఎం 10 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో నార్పలకు వెళ్తారన్నారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. 1.40 గంటలకు తిరిగి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ముగించుకొని తిరిగి వెళ్లే వరకూ ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 108, 104 వాహనాలను, స్పెషల్ డాక్టర్లను విమానాశ్రయంలో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమామహేశ్వర్‌రెడ్డి, యశ్వంత్ కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, ఆర్అండ్‌బీ డీఈ సంజీవయ్య, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా రవాణా అధికారి కరుణసాగర్‌రెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి, డీపీఓ విజయకుమార్, తహసీల్దార్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- అన్ని శాఖల అధిపతులు జిల్లా కేంద్రంలోనే ఉండాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



వైద్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖ అధిపతులు తప్పనిసరిగా జిల్లా కేంద్రంలోనే నివాసం ఉండాలన్నారు. లేకపోతే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి వైద్యుడు సెల్‌ఫోన్ నంబరునూ ప్రదర్శనకు ఉంచాలన్నారు. ఆస్పత్రుల్లో ఓపీ సంఖ్య పెరగాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలన్నారు. కంటి వెలుగు, ఫీవర్ సర్వే నమోదు ప్రక్రియ 100 శాతం చేపట్టాలన్నారు. సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారుల ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేయాలన్నారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం వడ్డించాలని, జిల్లా కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాల కోసం ఈ–ఆఫీస్ అమలు చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కిట్ల పంపిణీ, నిత్యవసర సరుకుల నిల్వ తదితర అంశాలపై ఐసీడీఎస్‌ను ఆరా తీశారు.

'గడప గడపకూ' పనులు వేగవంతం కావాలి..

'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా గుర్తించి చేపట్టిన పనులు వేగవంతం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు గుర్తించిన పనులను చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రస్తుతానికి 1,466 పనులు మంజూరు కాగా, 995 పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఇంకా 180 పనులు గ్రౌండింగ్ కాలేదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు.

నాడు–నేడు పనుల్లో పురోగతి కనిపించాలి..

'మన బడి నాడు–నేడు' పనుల్లో రోజువారీ పురోగతి కనిపించాలని కలెక్టర్ ఆదేశించారు. నాడు–నేడు, పాఠశాల విద్యలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. 1,089 పాఠశాలల్లో రెండో విడత 'నాడు–నేడు' పనులు చేపట్టగా, ఇటీవల రూ.45 కోట్లు విడుదల చేశామన్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేస్తే వెంటనే మంజూరు చేస్తామన్నారు. పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, పెయింటింగ్, తాగునీటి సరఫరా, పనులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. పాఠశాలల్లో బాలికలకు పూర్తి స్థాయి మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రైవేటు స్కూళ్లలో సీట్ల కేటాయింపుపై సమీక్షించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మదన్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ హిమవాణి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూసీలపై చర్యలు తీసుకోరా?

హిందూపురం: అనుమతిలేని నిర్మాణాల (యూసీ)పై చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారని టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) దేవికుమారీ ప్రశ్నించారు. శనివారం స్థానిక మున్సిపల్ ఆఫీసులో చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో అనుమతి లేని నిర్మాణాలు, ప్లానింగ్ లేని భవనాలు, ఆక్రమణలపై చార్జీలు వసూలు చేయడం లేదన్నారు. మూడేళ్లలో కార్యదర్శులు పట్టుమని పదింటిపై కూడా చర్యలు తీసుకోలేకపోయారన్నారు. ఇకపై క్షేత్రస్థాయి పరిశీలనలు చేసి వివరాలు పొందుపర్చాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాం, టౌన్ ఏసీపీ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో షార్ట్‌సర్క్యూట్

- రూ.2 లక్షల వరకు నష్టం



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ విజయ్ కుమార్

సోమందేపల్లి: మండలంలోని నల్లగొండ్రాయనపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో ఓ దుకాణంలో మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన సునీత దుకాణంలో కూల్‌డ్రింక్స్‌తో పాటు కిరాణ సరుకులు విక్రయిస్తూ జీవనం సాగిస్తూ ఉండేది. శనివారం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు చెలరేగాయి. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది. బ్యాంకులో రుణంతో దుకాణం నడుపుకుంటున్న సమయంలో తీవ్రంగా నష్టపోయామని, అధికారులు ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది. మండల ఎస్‌ఐ విజయ్ కుమార్ దుకాణాన్ని పరిశీలించారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ

- 'మా నమ్మకం నువ్వే జగన్' అంటోన్న జనం
- చంద్రబాబును విశ్వసించని ప్రజలు
- పవన్ కల్యాణ్ రాజకీయ నాయకుడు కాదు.. సినీ యాక్టరే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఇంటింటా అపూర్వ ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకర నారాయణ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం అందించని విధంగా జగనన్న ప్రభుత్వం సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తోందన్నారు. ప్రజల నాడి తెలుసుకోవడానికి ఇప్పటివరకూ రాష్ట్రంలోని 1.60 లక్షల కుటుంబాల వద్దకు గృహ సారథులు వెళ్లారన్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ, వారి అనుమతితో గృహాల గోడలపై స్టిక్కర్లు అంటించారన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగన్' అని జనమే అంటున్నారని పేర్కొన్నారు. జగనన్న సైనికులుగా ప్రజల సమస్యలు తెలుసుకుని, మరింత మంచి చేస్తామనే భరోసా ఇవ్వడమే కార్యక్రమ ఉద్దేశమని చెప్పారు. పేదలకు నాలుగేళ్లలో రూ. 2 లక్షల కోట్లు తమ ప్రభుత్వం అందించిందన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న ఆనందం, సంతృప్తి చూస్తే ఎంతో సంతోషమేస్తోందన్నారు. ఈ నెల 20 వరకూ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఓర్వలేని తండ్రీ కొడుకులు..

'మా నమ్మకం నువ్వే జగన్'కు ఆదరణ లభిస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ జీర్ణించుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ విమర్శించారు. జనసేన నాయకులు సైతం ఓర్వలేక పోతున్నారన్నారు. పచ్చ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తూ బురదజల్లే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. చంద్రబాబును ప్రజలు మళ్లీ కోరుకోవడం లేదని, ఆయన చేసిన మోసాన్ని వారు మరువలేదన్నారు. దిక్కు తోచని స్థితిలో పడిపోయినప్పుడు లేనిపోని రాద్ధాంతం చేయడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. మండలంలోని కొండంపల్లిలో చిన్న విషయాన్ని రాజకీయం చేయడమే దీనికి నిదర్శనమన్నారు. కొండంపల్లిలో టీడీపీకి చెందిన శ్రీరాములు నాయక్ అక్రమ మద్యం చరిత్రను, ఆయనపై ఉన్న కేసులను ఒకసారి బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప, సవితమ్మలు గమనించాలన్నారు. అలాంటి వ్యక్తికి వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తే ఖబడ్దార్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడు కానే కాదని, సినీ యాక్టరైన ఆయనకు ప్రజా సమస్యలపై అవగాహన లేదని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. డబ్బే పరమావధిగా పవన్ పని చేస్తున్నాడన్నారు. ప్యాకేజీ కోసం బీజేపీ, టీడీపీ చుట్టూ చక్రంలా తిరుగుతున్నాడన్నారు. బీజేపీతో పొత్తు ఉందంటోన్న ఆయన కనీసం విశాఖ ఉక్కు కంపెనీ ప్రైవేటీకరణ గురించి ఏ మాత్రం స్పందించలేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల, టౌన్ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు మునిమడుగు శ్రీనివాసులు, కొండలరాయుడు, దివాకర్, బయపురెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కేరళ 'నూతన' వేడుకలు



సంగీత కచేరి నిర్వహిస్తున్న విష్ణు దాస్ బృందం



ప్రసంగిస్తున్న సుమన్ బిల్లా

ప్రశాంతి నిలయం: ప్రశాంతినిలయంలో కేరళ నూతన సంవత్సర వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత మలయాళ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పూజా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ సాయిభక్తులు వేదపఠనం, విష్ణుదాస్ బృందం సంగీత కచేరి ఆకట్టుకున్నాయి. అంతకుమునుపు కేరళ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి సుమన్ బిల్లా మాట్లాడారు. తన జీవితంలో సత్యసాయి ప్రదర్శించిన మహిమాన్విత ఘట్టాలను వివరించారు. ప్రతి మనిషి ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ మంచి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ప్రేమ,సేవ తత్వాలను కలిగి ఉండడం అంటే దేవున్ని సేవించడమే అన్న విషయాన్ని మరువరాదన్నారు. అనంతరం భక్తులు మహాసమాధిని దర్శించుకున్నారు.

కారులో మంటలు

ప్రొద్దుటూరు : అనుకోకుండా కారులో మంటలు చెలరేగాయి. లోపల తల్లీబిడ్డ ఉన్నారు. వెంటనే మున్సిపల్ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన శ్రీకాంత్ తన భార్యతోపాటు చంటి బిడ్డను తీసుకుని కారులో ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో బర్త్ సర్టిఫికెట్ కోసం వారు ఇక్కడికి వచ్చారు. శనివారం ఉదయమే కదిరిలో బయల్దేరిన వీరు మధ్యాహ్నం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. శ్రీకాంత్ మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లగా చంటిబిడ్డతో ఆయన సతీమణి ఏసీ వేసుకుని కారులో నిద్రపోయారు. ఉన్నట్టుండి కారు ఇంజిన్‌లో పొగలు వచ్చాయి. 15-20 నిమిషాలకు దట్టమైన పొగలు రావడంతో అక్కడే ఉన్న మున్సిపల్ సిబ్బంది కారులో ఉన్న ఆమెను నిద్ర లేపి కిందికి దించారు. మున్సిపల్ ఏఈ దస్తగిరిరెడ్డి మోటార్ ఆన్ చేసి సిబ్బంది ద్వారా క్యాన్లతో మంటలను ఆర్పివేశారు. లోపలికి వెళ్లిన శ్రీకాంత్ బయటికి వచ్చి చూసి ఆశ్చర్యపోయాడు. ఇంజిన్‌లోని బ్యాటరీ వేడికి షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇలా జరిగిందని, ఇంకా కొద్దిసేపు ఆలస్యం జరిగి ఉంటే కారు అద్దాలు కూడా సీజ్ అయ్యేవని పక్కనున్న డ్రైవర్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది సాయంతో కారును షెడ్డుకు చేర్చారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

- నెలలోపే బాధిత డ్వాక్రా మహిళలకు రూ.73 లక్షల పంపిణీ



బాధిత డ్వాక్రా మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ఇచ్చిన మాట ప్రకారం నెలలోపే ఓ ఘరానా మోసగాడి ఆటకట్టించారు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి. అతడి నుంచి రికవరీ చేసిన డబ్బు రూ. 73 లక్షలను శనివారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 19 పొదుపు సంఘాలకు చెందిన 190 మంది మహిళలకు పంపిణీ చేసి సంతోషం పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ కాయ కష్టం చేసి ప్రతి నెలా పొదుపు సంఘాల కంతులను చెల్లించే మహిళల డబ్బును బ్యాంకుకు చెల్లించకుండా బిజినెస్ కరస్పాండెంట్ మోసం చేయడం ఎంతో కలచి వేసిందన్నారు. కేసును సవాలుగా తీసుకుని డబ్బు రికవరీలో ప్రధాన భూమిక పోషించిన పట్టణ సీఐ సుబ్రహ్మణ్యంను అభినందించారు. పొదుపు సంఘాల మహిళల రుణాలకు సంబంధించి వైకేపీ అధికారులు క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. యూనియన్ బ్యాంక్ అధికారులు ఇకపై ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, దిక్కుతోచని స్థితిలో పడిన తమకు ఇచ్చిన మాట ప్రకారం నెలలోపే డబ్బు రికవరీ చేయించడం ఎంతో ఆనందం కల్గించిందని పొదుపు సంఘాల మహిళలు ఎమ్మెల్యే ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ అప్పిరెడ్డిగారి సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి, వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మీనారాయణ, సీసీ శివారెడ్డి, యూనియన్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్ : ఈ నెల 17న సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. తాడిపత్రి నుంచి వయా నార్పల, బత్తలపల్లి మీదుగా కదిరి లేదా ధర్మవరం వైపు వెళ్లే భారీ వాహనాలను నాయనపల్లి క్రాస్ నుంచి నేరుగా బుక్కరాయ సముద్రం, అనంతపురం, బత్తలపల్లి మీదుగా వెళ్లవచ్చని వివరించారు. కదిరి లేదా ధర్మవరం నుంచి నార్పల మీదుగా తాడిపత్రికి వెళ్లాల్సిన వాహనాలను బత్తలపల్లి, అనంతపురం, బుక్కరాయసముద్రం, నాయనపల్లి మీదుగా మళ్లించారు. పులివెందుల, తాడిమర్రి, మాల్యవంతం మీదుగా నాయనపల్లి, తాడిపత్రికి వెళ్లాల్సిన వాహనాలను మాల్యవంతం నుంచి బత్తలపల్లి, అనంతపురం, బీకేఎస్, నాయనపల్లికి మళ్లించారు. నార్పల మీదుగా బత్తలపల్లి వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలను వెనక్కు మళ్లించి అనంతపురం మీదుగా బత్తలపల్లి వైపు మళ్లిస్తారు.

పార్కింగ్ ఇక్కడే..

- అనంతపురం, బుక్కరాయసముద్రం మీదుగా వచ్చే బస్సులకు, బత్తలపల్లి నుంచి వచ్చే వాహనాలకు నార్పల జంక్షన్ దాటాక నాయనపల్లి రోడ్డులోని ఆర్టీటీ ఆఫీస్ సమీపాన పార్కింగ్‌కు స్థలం కేటాయించారు.
- తాడిపత్రి, శింగనమల, నాయనపల్లి నుంచి వచ్చే వాహనాలకు నార్పల జంక్షన్ దాటాక బత్తలపల్లి రోడ్డులోని పార్కింగ్ స్థలం.
- గూగూడు నుంచి నార్పల మీదుగా వచ్చే వాహనాలకు నార్పల జంక్షన్ దాటాక బత్తలపల్లి రోడ్డులో పార్కింగ్.

బైకుపై తెగిపడిన కరెంటు తీగ

- యువకుడికి తీవ్ర గాయాలు

నల్లమాడ: విద్యుత్ తీగ తెగిపోయి ద్విచక్రవాహనంపై పడటంతో యువకులు కిందపడ్డారు. ఓ యువకుడి కాలు పూర్తిగా విరిగింది. మండలంలోని వంకరకుంట గ్రామానికి చెందిన షేక్షావలి, పవన్ శనివారం ద్విచక్రవాహనంలో పుట్టపర్తికి వెళ్తున్నారు. బాసంవారిపల్లి సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగ తెగి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనంపై పడింది. షేక్షావలి కుడికాలికి చుట్టుకోవడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. ప్రమాదంలో షేక్షావలి పాదం పైభాగాన విరిగిపోయింది. పవన్‌కు గాయాలయ్యాయి. తీగ ద్విచక్రవాహనంపై పడగానే అర్త్ అయి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు తొలగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రాణాపాయం తప్పిందని, లేనిపక్షంలో ప్రాణనష్టం జరిగి ఉండేదని గాయపడిన వారితో పాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ స్థానికుల సహకారంతో క్షతగాత్రులను 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని వైఎస్సార్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యుత్ తీగ పడి ప్రమాదం చోటు చేసుకుందని క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా, సమాచారం ఇవ్వకుండా బాసంవారిపల్లికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు వేయడానికి ప్రయత్నించాడని, కుటాలపల్లి ఫీడర్‌కు చెందిన రెండు ఫేజులను కట్టెతో తగిలించడంతో తీగలు తెగి కిందపడినట్లు విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఏఈ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు.

ఈరన్నకు అవమానం!

- 'గుండుమల'ను సమన్వయకర్తగా నియమంచి ఈరన్నను దూరం పెట్టిన వైనం
- దళిత నేత కావడంతోనే చెక్ పెట్టారని విమర్శలు



గుండుమల తిప్పేస్వామి



ఈరన్న

మడకశిర: మడకశిర నియోజకవర్గానికి మొదటి నుంచి పార్టీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న దళిత వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు పార్టీ హైకమాండ్ చెక్ పెట్టింది. నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని నియమిస్తూ శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. దళిత నేత కావడంతోనే ఈరన్నను దూరం పెట్టారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

దళిత సంఘాల ఆగ్రహం...

మడకశిర ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. ఈరన్న గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి పార్టీ వ్యవహారాలను చూస్తున్నారు. అయితే పార్టీ హైకమాండ్ ఉన్న ఫళంగా దళిత వర్గానికి చెందిన ఈరన్నను తప్పించి సమన్వయకర్తగా బీసీ వర్గానికి చెందిన గుండుమల తిప్పేస్వామిని నియమించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. టీడీపీలో తమ కులస్తులకిచ్చే గౌరవం ఇదేనా? అంటూ పలువురు దళిత సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఆయా వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఇద్దరూ కలిసి పనిచేస్తారా..?

సమన్వయకర్తగా నియమించడంతో నియోజకవర్గ పార్టీ బాధ్యతలు మొత్తం గుండుమల తిప్పేస్వామి చేతుల్లోకి వెళ్లినట్లయింది. ఇలాంటి పరిస్థితిలో ఈరన్న వర్గం, గుండుమల తిప్పేస్వామి వర్గంతో కలిసి పని చేస్తుందా? లేదా? అనే విషయం చర్చనీయాంశమైంది. ఇంత వరకు పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఈరన్నతో గుండుమల తిప్పేస్వామి వర్గం కలిసి పని చేయలేదు. పార్టీ కార్యక్రమాలను కూడా రెండేళ్లుగా వేర్వేరుగానే చేపడుతున్నాయి. ఇకపైనా ఈరన్న వర్గం గుండుమల తిప్పేస్వామితో కలిసి పని చేయడం అనుమానమే.

నాడు మిత్రులు.. నేడు శత్రువులు..

ఈరన్న, గుండుమల తిప్పేస్వామి ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న వారే. మంచి మిత్రులు కూడా. టీడీపీలో కూడా కొన్నాళ్లపాటు కలిసి పని చేశారు. ఇటీవల కాలంలో వీరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. రాజకీయాల్లో బద్ధ శత్రువులుగా మారారు. గుండుమల తిప్పేస్వామిని ఈరన్న విభేదించడం ప్రారంభించారు. అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హైకమాండ్‌లో ఈరన్నకు వ్యతిరేకంగా ఫీడ్‌బ్యాక్ ఇస్తూ చివరకు పార్టీలో స్థానం లేకుండా చేయడం గమనార్హం.

ఈరన్న వర్గంలో తీవ్ర అసంతృప్తి..

నియోజకవర్గంలో ఈరన్నకంటూ ఓవర్గం బలంగా ఉంది. ఆర్థికంగా వెనుకబడినా మొదటి నుంచి మెజార్టీ నాయకులు, గ్రామ స్థాయిలో పార్టీ క్యాడర్ ఆయనకు అండగా నిలబడింది. అలాంటి తమ నేతను పార్టీ బాధ్యతల నుంచి తప్పించిన హైకమాండ్‌పై ఆ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో అంతంతమాత్రంగానే ఉన్న టీడీపీ పరిస్థితి ఈ పరిణామాలతో మరింత దిగజారేలా కనిపిస్తోంది.